# మృత్యు క్రీడ

- డా. వి. ఆర్. రాసాని

ఆ రోజు ఉదయం ఎనిమిదో గంట ఆఖరి నిముషం గడుస్తోంది! సూర్యుడు ఆ పట్నం మీద గోరువెచ్చని ఎండని కురిపిస్తున్నాడు. రాత్రంతా మంచుకి వణికిపోయిన ప్రకృతి, చలిపులి పైన స్వారీ చేయడానికి సన్నద్ధమవుతోంది. ఆకాశం లోని ఎర్రటి మేఘం క్రమంగా తెల్లబడుతోంది. జిడ్డోడుతున్న బాలభానుడి కిరణాలు మంచు గుండెల్లో గుచ్చుకుంటున్నాయి. ఆ తాకిడికి మంచు మర్త్యలోకం నుంచి పలాయనం చిత్తగిస్తోంది. ఆకాశానికి ఉరేసుకున్నట్లు కనిపిస్తున్న ఎత్తయిన భవంతులు మంచు ముసుగుల్ని తొలగించుకుని వెలుతురు స్నానం సాగిస్తున్నాయి. అలాంటి ఎత్త యిన ఒక భవంతి మీదుగా ఒక తీతువు 'ఉత్తీత! ఉత్తీత!' అంటూ భయంకరంగా అరుచుకుంటూ వెళ్లిపోయింది. రాత్రిపూట అరవాల్సిన ఆ పక్షి పగటిపూట అరవడం విడ్డూరంగా అనిపించింది. చూస్తుండగానే బోరుముంతలు ఆకాశంలో చక్కి రాలు కొడుతూ కర్ణకఠోరంగా అరవసాగాయి. వాటి తర్వాత కాకులు గుంపులు గుంపులుగా చేరిపోయి కావ్‌కావ్ అంటూ రొద చేయసాగాయి. తూనీగలు, కందిరీగలు హఠాత్తుగా, మందలు మందలుగా ఆకాశంలోకెగిరి 'ఘీ' అని శబ్దం చేస్తూ ఒకటే హడావుడి చేయసాగాయి. కోళ్లు కొక్కెర రోగం వచ్చిన వాటిలా నేలపైన దొర్లిదొర్లి, కాళ్లు రాచుకుంటూ రెక్కలు నేలకేసి కొడుతూ 'కొక్కొక్కో' అంటూ కొటారించి చూస్తున్నాయి. భూమిలో వున్న ఎలుకలు వున్నట్టుండి పైకొచ్చి కీచుకీచుమని అరుచుకుంటూ బీళ్లలోకి, వీధుల్లోకి పరిగెత్త సాగాయి. మండ్రగబ్బలు, తేళ్లు, పాములు శబ్దం చేసుకుంటూ భూమిపైన బిజీగా తిరుగుతూ కనిపించాయి.

మెల్లగా చెట్లు సారా తాగి తలలూపే తాగు బోతుల్లా ఊగసాగాయి. కాళ్ల కింద ఏదో కదులు తున్న భావన. ఎక్కడో పాతాళంలో నుంచి నేల చీలిపోతున్న చిహ్నాలు.

ఉన్నట్టుండి భయంకరమైన శబ్దం! అంతే! ఆ మరుక్షణమే... అయిపోయింది. అంతా అయి పోయింది. కళ్లు మూసి తెరిచే లోపల జరిగి పోయింది. ఎంత ఘోరం జరగాలో అంతా జరిగి పోయింది. క్షణం క్రితం వరకూ భూలోక స్వర్గంగా వున్న ఆ ప్రాంతం... ఇప్పుడొక శ్మశానంలా మారిపోయింది.

ఎయిర్‌పోర్ట్‌లో లాండ్ చేసివున్న విమానాలు ఉన్నట్టుండి నేలలోకి కూరుకుపోయాయి. ఇండ్లన్నీ నేలమట్టమైపోయాయి. భవంతులన్నీ సిమెంట్ పెళ్లల కుప్పలుగా మారిపోయాయి.

కంటికి కనిపించని ఏ రాక్షసమాయో ఇండ్లనీ, ఇండ్లల్లో వున్న మనుషుల్ని చేతుల్లోకి తీసుకుని కర్కశంగా నలిపి నలిపి పొడిచేసి పారేస్తున్నట్లు అనిపించింది.

ఎక్కడ చూసినా మనుషుల ఆర్తనాదాలు, మూలుగులు, అరుపులు, కేకలు. అది భూకంప పిశాచి కోరలు చాచిన స్థలం. భుజ్‌లోని కచ్ ప్రాంతం.

సగం నేలలోకి కూరుకుపోయి ఒక ప్రక్కకు వంగిపోయి వున్న ఆరంతస్తుల అపార్ట్‌మెంట్ల ముందర జరిగింది తలచుకుని కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ కూర్చొనున్నాడు నలభయ్యేళ్ల రామ్‌లాల్.

ఆ భవంతిలో అక్కడక్కడా కప్పు వూడి పడిన సిమెంట్ పెళ్లలు, కాంక్రీట్ దిమ్మలు, వాటి నుంచి పైకి పొడుచుకుని వచ్చి కనిపిస్తున్న ఇనుప చువ్వలు. వాటి మధ్యన, దిమ్మల కింద చిందర వందరయిన శరీరాలతో కొన్ని శవాలు. పై అంతస్తులో ఎక్కడో మూలుగులు, పైకి వెళ్లి ఆ మూలిగే వాళ్లని రక్షించాలనీ... కానీ ఒక్క క్షణం భయం వేసింది. అంత బీభత్సాన్ని చూసిన అతనికే భయం కలగడం చిత్రంగా అనిపించింది. వెంటనే వెళ్లి రక్షించాలనుకున్నాడు. కానీ మళ్లీ భూమి



కంపించింది. ఆ భవనం ఒక్కసారి నీటిపైన పడవలా అటూఇటూ ఊగింది. ఆ వెంటనే పటపటమన్న శబ్దం వినిపించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా లేచి దూరంగా పరిగెత్తాడు. అతను అలా పరిగెత్తి వచ్చేసిన మరుక్షణమే అదీ నేలమట్టమైపోయింది. అంతవరకూ వినిపించిన మూలుగులూ ఆగిపోయాయి.

'ఛత్! మళ్లీ మళ్లీ భూకంపం వస్తోందని తెలిసీ భవంతికి సమీపంలో ఉండడం అవివేకం' అనుకుంటూ వుండిపోయాడు.

ఇక ఎక్కడుండాలో అతనికి అర్థం కాలేదు. చుట్టూ చూశాడు. చూసేంత దూరమూ ఒకటే బీభత్సం, ఒకటే దృశ్యం. నేలమట్టమైపోయిన ఇళ్లు, మొండి గోడలు. అక్కడొకటీ అక్కడొకటిగా శిథిలావస్థలో అలాగే నిలబడివున్న జనవాసాలు... ఆ ఇళ్ల మధ్యనే, కొంత దూరంలో సురక్షితంగా ఇంకా అలాగే నిలబడివున్న నాలుగంతస్తుల భవంతి... ఎక్కడా నరసంచారమే లేదు. ఉదయం నుంచీ తరచూ భూమి కంపిస్తుండటంతో మిగిలిన కొద్ది మందీ ఆ ప్రాంతం వదిలేసి సురక్షిత ప్రాంతాలకు ఎప్పుడో వెళ్లిపోయారు. రామ్‌లాల్‌కు ఏం చేయాలో తోచలేదు. ఆ రోజంతా అలాగే తచ్చాడుతూ అక్కడే వుండిపోయాడు. చూస్తుండగానే సాయంత్రమైపోయింది. అతనికిప్పుడు ఏడుపు కూడా రావడం లేదు.

తన కళ్లముందరే అయిన వాళ్లు, అన్న

దమ్ములు, మిత్రులు సజీవ సమాధయిపోయారు. వాళ్లతోబాటు తన భార్యాపిల్లలూ ఆ శిధిలాల కిందపడి కనిపించకుండా పోయారు.

అప్పటినుంచీ రామ్‌లాల్ ఏడుస్తూనే వున్నాడు. ఏడ్చిఏడ్చి అలసిపోయాడు. చనిపోయిన బంధు మిత్రులను, భార్యాపిల్లలను కనుగొని, కనీసం వాళ్ల శవాలనైనా కడసారిగా చూసుకోవాలని ఎంతగానో తాపత్రయపడ్డాడు. కానీ వాళ్ల జాడే కనిపించలేదు. ఇక తనేం చేయగలడు? తను అసహాయుడు. ఎంత విజ్ఞానం సంపాదించినా, ఉపగ్రహాలకు చేరి విశ్వాంతరాళంలోని రహస్యాలనెన్నింటినో ఛేదించినా మనిషి ప్రకృతి ముందు పరమాణు వేనన్న సత్యం రామ్‌లాల్‌కి మొదటిసారిగా స్ఫురించింది.

తన కళ్ల ముందరే అంతటి మానవ హననం జరిగిపోవడంతో అతను భవబంధాలు జయించిన ఒక మహా ఋషిలా అయిపోయాడు. సుఖదుఃఖాల కతీతమైన ఒక నిరామయ స్థితి అతని మనసులో చోటుచేసుకుంది. దాంతో ఒకేచోట నిలబడలేక అలా బయలుదేరాడు. నాలుగంతస్తుల మేడ దాటుకుని పోతుంటే, ఒకచోట పెద్ద టార్పాలిన్ దొరికింది. దాన్ని తీసుకుని అక్కడే ఒక చిన్న టెంట్ వేసుకున్నాడు. నేలపైన అలాగే పడుకున్నాడు.

ఆ సమయంలో ఎప్పుడో ఇరవయ్యేళ్ల క్రితం వదిలేసి వచ్చిన తన స్వగ్రామం 'కర్బాన్' గుర్తుకొచ్చింది. ఆ పల్లెలోని ప్రజలు గుర్తుకొచ్చారు. తను పుట్టిపెరిగిన పరిసరాలు గుర్తుకొచ్చాయి. పాపం! వాళ్లెలా వున్నారోనని ఒక్క క్షణం అనుకున్నాడు.

పొద్దు మామూలుగానే గ్రుంకింది!

భూకంపం కంటే భయంకరమైన చీకటి ప్రపంచాన్నంతా ఆవరించింది. గతరాత్రి ఎప్పుడో తిన్నదే. కడుపులో ఒకటే మంట. తాగడానిక్కూడా నీళ్లు లేవు. నిద్రపట్టడం లేదు. ఒంటరిగా ఉండాలంటే భయం. చుట్టూ శవాలున్నాయన్న ఆలోచన. మగతగా కళ్లు మూసుకున్నాడు. అలాగే ఎప్పుడు నిద్రపోయాడో అతనికే తెలీదు. కళ్లు తెరచి చూసేసరికి ఎప్పుడో తెల్లవారింది.

మానవ నాశనం జరిగి అప్పుడే ఒకరోజు గడిచిపోయింది! ఒకటే వాసన, దుర్వాసన, శవాల కంపు.

మెల్లగా లేచి టెంట్ వెలుపలికి వచ్చాడు. ఆకాశంలోకి చూశాడు. అప్పటికే తూర్పున బారెడు పొద్దెక్కింది. ఇంతలో పెద్ద శబ్దం చేసుకుంటూ ఆకాశంలో ఒక లోహ విహంగం రివ్వున వెళ్లసాగింది.

'ఎందరు చచ్చారో, ఏఏ ప్రాంతాలు నాశన మయ్యాయో అని చూడడానికి వచ్చిన ఏ ముఖ్య మంత్రో, ఏ ప్రధానమంత్రో అయుంటాడు. ఊరకే చూడడం, పేపర్లలో ఫోటోలు వేయించుకోవడం వీళ్లకు పరిపాటి. ఇక వీళ్లు చేసే సహాయమే ముంటుంది?' అనుకున్నాడు.

ఆ తర్వాత నిన్నటి వరకు తనున్న అపార్ట్ మెంట్ల ప్రాంతం కోసం చూశాడు. ఎంత దూరం చూసినా కుప్పకూలిపోయి వున్న భవనాలే తప్ప ఆ ప్రాంతం గుర్తుపట్టలేకపోయాడు.

'ఏం పిల్లలో, ఏం పాపలో... ఈ కాంక్రీట్ పెళ్లల కిందపడి సజీవ సమాధి అయిపోయి అప్పుడే ఒక దినం గడిచిపోయింది'

నిర్లిప్తంగా అనుకున్నాడు రామ్‌లాల్.

'ఈ శిధిలాల కింద ఇంకా బతికి వుంటారేమో. ఎవరయినా రాకపోతారా! ఈ శిధిలాల్ని తీయకపోతారా! అప్పుడు ప్రాణాలతో కాకపోయినా నా వాళ్లని చూడకపోతానా! చూస్తాను. నా వాళ్లని ఒక్కసారయినా సరే. తప్ప కుండా చూస్తాను. అంతవరకూ ఈ చోటు వదలను'

అనుకున్నాడు. ఎక్కడో ఒక చిన్న ఆశ!

అంతలోనే మళ్లీ నిర్వేదం, నిరాశ!

'అన్నీ పోగొట్టుకుని, అందర్నీ పోగొట్టుకుని ఇంకా ఎవరి కోసం బతకాలి. ఏముందని బతకాలి' కళ్లనీళ్లు పెట్టుకున్నాడు రామ్‌లాల్.

ఇంతలో ఏదో చప్పుడయింది. అటువైపు చూశాడు. ప్రక్కనే మరో కూలిపోయిన బిల్డింగ్. ఆ ప్రాంతం నుంచి ఏవో సన్నని మాటలు వినిపిస్తు న్నాయి. ఆ మాటల్ని మళ్లీ మళ్లీ విన్నాడు. అతనికి ప్రాణం లేచొచ్చింది.

'ఎవరో ఇంకా బతికున్నట్లుంది. సాయం చేద్దాం' అనుకుంటూ అటువైపు కదిలాడు.

అక్కడి దృశ్యం చూసి నిట్టనిలువునా స్తంభించి పోయాడు.

ఎవరో ముగ్గురు వ్యక్తులు ముప్పై ముప్పై అయిదు సంవత్సరాల వయసు వాళ్లు. శవాలపై నున్న నగల్ని వల్చుకుంటున్నారు. ఆ శిధిలాలలో దొరికిన వస్తువుల్ని దొరికినట్లే దోచుకుంటున్నారు.

'ఈ మనుషులకు నీతీపాతీ ఏమీ లేదు. శవాల్ని కూడా దోచుకుంటున్నారు. ఛీ!' అను కుంటూ 'ఎవర్రా మీరు?' అని గట్టిగా కేకేశాడు. కానీ వాళ్లు అదరలేదు, బెదరలేదు.

'ఒరేయ్! ఆగండి. ఏమిటి మీరు చేస్తున్న పని?' ఆవేశంగా ప్రశ్నించాడు.

ఒకతను అతన్ని వింతగా చూసి 'అన్నా! మేమిద్దరమూ ఈ కచ్ వాళ్లమే. అతను కర్బాన్ ప్రాంతంవాడు. మేమూ నీలాంటి వాళ్లమే. అన్నీ పోగొట్టుకున్న వాళ్లం' అన్నాడు.

'తినడానికి తిండి లేదు! ఉండడానికి ఇళ్లు లేవు. ఇంకేం చేస్తాం' ఇంకో అతను అన్నాడు.

'అయితే మాత్రం శవాలపైన సొమ్ములు దోచుకోవడం పాపం కాదా?'

'పాపం! ఇన్ని వేలమంది చనిపోయారే. వీళ్లంతా ఏ పాపం చేశారనీ... ముసలివాళ్లు, పాలుతాగే పిల్లలు... ఒకరేమిటి అందరూ... కళ్లముందరే చూస్తుండగానే చనిపోయారు. వీళ్లంతా ఏ తప్పు చేశారనీ...' మరో అతను ఏడుస్తూ అన్నాడు.

'అయినా...' ఇంకా ఏదో చెప్పబోయాడు రామ్‌లాల్.

'చూడు భాయ్! నువ్వేం చెప్పబోతావో నాకు తెలుసు. మనమూ పోయిన వాళ్లతో పోలేం. అదృష్టముండీ బతికాం గనక జీవించాలి. బాగా జీవించాలి.'

'అందుకోసం మనకు సొమ్ము కావాలి.'

'అవును భాయ్! తుఫానుల పేరుతోనూ, వరదల పేరుతోనూ పెద్దపెద్ద రాజకీయ నాయకులే విరాళాలు వసూలు చేసి తినేస్తున్నారు. రేపు ఈ ఉత్పాతం చూపించి లక్షలు, కోట్లు విరాళాల రూపంలోనో, మరో రూపంలోనో దండుకుని, భిక్ష వేసినట్టుగా మన ముఖాన కాసిన్ని తిండిగింజలు, మరికాసిన్ని పాత బట్టలు విసిరికొడతారు. అంతే!'

'ఈ శవాల్ని మనం దోచుకోకపోయినా, మనకు సహాయం చేయడానికని వచ్చిన ఏ పోలీసోడో లేదా మరొకడో దోచుకోకుండా వదలడు.'

'మనం బాధితులం. పైగా బతికున్న వారిని దోచుకోవడం లేదు. చచ్చిన వాళ్లని దోచుకుం టున్నాం. అది పెద్ద పాపంగా నేను అనుకోవడం లేదు.'

వాళ్లు చెప్పిందీ నిజమేననిపించింది రామ్‌లాల్‌కి.

'ఆవ్ భాయీ! నువ్వు మాతో రా...' దోచుకున్న నగల్ని కొన్నింటిని అతని చేతుల్లో పెట్టాడొకడు. మారుమాట్లాడలేదు రామ్‌లాల్.

మౌనంగా తలొంచుకుని వాళ్ల వెంట నడవసాగాడతను. అలా బయలుదేరి వాళ్లు ఆ ప్రాంతమంతా తిరిగారు. కనిపించిన నగల్ని, బట్టల్ని, తినుబండారాల్ని, ఇంకా ఎన్నో విలువైన వస్తువుల్ని దోచుకోసాగారు. అలాగే కొనవూపిరితో వున్న వాళ్లని కొందరిని రక్షించే ప్రయత్నాలు కూడా చేశారు. రక్షించిన వారికి తమ దగ్గరున్న తినుబం డారాల్ని, నీళ్లను ఇచ్చారు.

అలా ఆ సాయంత్రం వేళకు ఇంకా పడి పోకుండా వున్న నాలుగంతస్తుల బిల్డింగు చేరుకున్నారు. అందులో నరసంచారమే లేదు. అందులో ఒక గది కంప్యూటర్ సెంటర్ కాబోలు. గదిలో చాలా కంప్యూటర్లున్నాయి. ఆ భవంతి పైకి బాగా కనిపిస్తున్నా, భూకంపం తాకిడి వల్ల లోపల కొన్ని గదులు కప్పు ఊడిపోయి గోడలు బీటలువారి కనిపిస్తున్నాయి.

అక్కడున్న కంప్యూటర్లలో బాగున్న వాటిని తలా ఒకటి తెచ్చుకున్నారు. అలాగే కూలిపోయిన గదుల్లో నుంచి పట్టుచీరలు, సీడీలు, టీవీలు, విసిపి, విసిఆర్‌లు తెచ్చుకున్నారు. ఇంకా విలువైన వస్తువుల్ని ఎన్నింటినో తెచ్చుకున్నారు. తెచ్చుకున్న వాటిని సమంగా పంచుకున్నారు.

పంచుకున్న వాటినన్నింటినీ తీసుకుని వచ్చి తన టెంట్‌లో పెట్టుకున్నాడు రామ్‌లాల్.

సాయంత్రం కావస్తోంది. ఆ బిల్డింగ్ వరండాలో కూర్చొని మిగిలిన మిత్రులు ముగ్గురు

మరో చోటి నుంచి తెచ్చుకున్న స్కాచ్ విస్కీని గ్లాసుల్లో పోసుకుని తాగసాగారు. గొంతులదాకా తాగారు. జరిగింది తలచుకుని కలిగిన బాధనంతా మరచి పోయేదాకా తాగారు. బాగా తాగారు.

విస్కీ మత్తు పాదరసంలా వాళ్ల నరనరంలోకి ప్రాకుతోంది. వాళ్ల మాటలు నత్తినత్తిగా వినిపిస్తున్నాయి.

'ఒరే! మనం దోచుకున్న ఈ వస్తువుల్ని అమ్ముకుంటే చాలు. లక్షలు వస్తాయి.'

'అవున్రా! ఈ బంగారం అమ్ముకుంటే చాలు. కోటీశ్వరులమైపోతాం.'

'వీటితో మన తరువాత ఏడు తరాలు ఏ చీకూచింతా లేకుండా బతికేయగలరు.'

దోచుకున్న నగల్ని, వస్తువుల్ని మురిపెంగా చూస్తూ మాట్లాడుకోసాగారు.

వాళ్ల మాటలు అస్పష్టంగా రామ్‌లాల్‌కు వినిపిస్తూనే వున్నాయి. పడమటి దిశలో కరడుగట్టిన కోపాగ్నిలా ఎర్రగా జ్వలిస్తున్నాడు సూర్యుడు.

భవనం వరండాలో నవ్వులు, ఈలలు.

అక్కడ ఆనందహేల! మత్తు మాటల గోల!

ఆ గోల భూమాత కడుపులో మంట పెట్టింది. కడుపు మండింది. ఫలితంగా రామ్‌లాల్ కళ్లముందరే ఆ భవంతీ కూలిపోయింది.

రామ్‌లాల్ శరీరం మొదలు నరికిన చెట్టులా కదిలిపోయింది.

'రేయ్!' అంటూ గట్టిగా కేకేశాడు.

అతని కేక అరణ్య రోదనే అయింది. ఆ మాటను వినడానికి గానీ, విని సమాధానం చెప్ప డానికి గానీ ఎవ్వరూ మిగల్లేదు.

వరండాలో వున్న ఆ ముగ్గురూ సజీవ సమాధే అయ్యారు.

'శవాల్ని దోచుకున్న దౌర్భాగ్యుల్ని భూమాత క్షమించలేకపోయింది. నన్నూ క్షమించదు.'

భోరున ఏడ్చాడు. నెత్తీనోరూ కొట్టుకుని ఏడ్చాడు.

'ఇంక ఈ మరుభూమిలో ఏం మిగిలిందనీ... నేను పంచుకున్న ఈ సిరి మాత్రం శాశ్వతమా? నా అన్న వాళ్లు లేకుండా పోయిన తర్వాత... దురాశ కాకపోతే ఈ సిరి ఎవరి కోసం? ఛీ...'

'మనిషిలోని ఆశకు, స్వార్థానికి బుద్ధే కాదు, ఇంగితం కూడా ఉండదు కదా.'

పరిపరి విధాలా ఆలోచించసాగాడు.

టెంట్‌లో తాను దాచుకున్న నగల్ని, ఇతర వస్తువుల్ని ఒక్కసారి చూశాడు. ఘడియ ముందు వరకూ అపురూపంగా అనిపించిన అవి ఆ క్షణంలో అంటరాని నరకంలా అనిపించాయి. ఒక భూతంలా కనిపించాయి. ఒక భయంకర మోహినీ పిశాచంలా తోచాయి. అంతే కేకరించి ఒక్కసారి వాటిపైన ఉమ్మేశాడు. వాటినీ, ఆ టెంట్‌నీ వదిలేసి చక్కా వెళ్లిపోయాడు.

సరిగ్గా అప్పుడే ఒక సహాయ శిబిరం ఎదురుగా వచ్చింది. అది ఆ ప్రాంతానికి వచ్చిన మొదటి సహాయ శిబిరం.

'అయ్యా! నేనూ మీ శిబిరంలో చేరతా. తోచిన సాయం చేస్తా' అంటూ ఆ శిబిరంలో కలసి పోయాడు రామ్‌లాల్.

రామ్‌లాల్‌కు ఇప్పుడు ఆనందంగా తోచింది. మనసు హాయిగా అనిపించింది.

ఆ ప్రాంతానికి క్రమంగా మనుషులు రాసాగారు. సహాయ శిబిరాలతో, బట్టలు, బియ్యం, గోధుమలు మోసుకొచ్చిన వాహనాలతో ఆ ప్రాంతం బిజీగా మారసాగింది. సహాయ చర్యల్లో సైనిక దళాలు దిగిపోయాయి.

శిథిలాల్ని ఎత్తేవాళ్లు, వాటి కింద వున్న శవాల్ని తీసేవాళ్లు, బతికున్న వాళ్లకి వైద్య సహాయం చేసేవాళ్లు, మందులు, తినుబండారాలు, తిండి గింజలు, బట్టలు పంచేవాళ్లు, డబ్బులు సాయం చేసేవాళ్లు... రకరకాల పనులు, రకరకాల వ్యక్తులు, రకరకాల శిబిరాలు...

ఎందరు వస్తున్నా, శిబిరాలు దిగుతున్నా, ఎన్ని పనులు చేస్తున్నా అక్కడంతా రామ్‌లాల్... ఎక్కడికి వెళ్లినా ముందువరుసలో రామ్‌లాల్! ఇక్కడ రామ్‌లాల్! అక్కడ రామ్‌లాల్! ఎక్కడ చూసినా రామ్‌లాల్!

రామ్‌లాల్! రామ్‌లాల్!

రామ్‌లాల్ ఇప్పుడు కేవలం వ్యక్తి కాదు.

జాలి, దయ, మానవత్వం నిండిన ఒక మహాశక్తి!!